పల్లెలకు కాసుల కళ వచ్చింది. గత ప్రభుత్వం దారి మళ్లించిన ఆర్థిక సంఘం నిధులను తాజాగా పంచాయతీ ఖాతాలకు జమ చేశారు. ఈ మేరకు జిల్లాకు 2023-24 ఆర్థిక సంవత్సరానికి రెండో విడత 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.29.24 కోట్లు జనాభా ప్రాతిపదికన విడుదలయ్యాయి. ఇచ్చిన మాటను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవడంతో పంచాయతీలకు నిధులొచ్చాయి.

- చిత్తూరు కలెక్టరేట్



పల్లెకు 'కాసుల' కళ

- పంచాయతీలకు ప్రభుత్వం వెన్నుదన్ను
- 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.29.24 కోట్లు విడుదల
- మాట నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం

పల్లెలే దేశప్రగతికి పట్టుకొమ్మలన్న జాతిపిత మాటలను గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. సర్పంచులను ఉత్సవ విగ్రహాలుగా మార్చింది. వీటికి సమాంతరంగా గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసింది. కేంద్రం విడుదల చేసే ఆర్థిక సంఘం నిధులను లాక్కొని విద్యుత్ బకాయిలకు చెల్లించినట్లు నోటిమాట ద్వారా చెప్పింది. పంచాయతీలకు ఎక్కడ ఎంత విద్యుత్ బకాయిలకు నిధులు జమచేశారో తెలియడం లేదు. అందుకు రశీదులు కూడా ఇవ్వలేదు. ఆ నిధులు ఏమయ్యాయో ఇప్పటికీ తెలియదు. ఇలా నిధులను దారి మళ్లించడంతో గ్రామాల్లో చిన్న చిన్న పనులు కూడా చేయలేని స్థితికి సర్పంచులు చేరారు. ఈ క్రమంలో తాము అధికారంలోకి వస్తే పంచాయతీలకు పూర్వ వైభవం తీసుకొస్తామని కూటమి నేతలు ప్రకటించారు. ఆ ప్రకారం ప్రభుత్వం ఏర్పాటు కాగానే పంచాయతీరాజ్ వ్యవస్థకు పూర్వవైభవం తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టింది. పంచాయతీల రూపురేఖలు మార్చేదిశగా ఆ శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కసరత్తు చేపట్టారు. గత ప్రభుత్వం దారి మళ్లించిన ఆర్థిక సంఘం నిధులను తాజాగా పంచాయతీ ఖాతాలకు జమచేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఆ ప్రకారం జిల్లాకు రెండో విడత 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.29.24 కోట్లు వచ్చాయి.

పంచాయతీలు	: 697
ఎన్నికలు జరగనివి	: 13
నిధులు విడుదల	: 684
జనాభా	: 1,436,580
టైడ్ గ్రాంట్	: రూ.17,54,98,705
అన్‌టైడ్ గ్రాంట్	: రూ.11,69,98,977

ఖర్చు చేసేదిలా..

టైడ్ గ్రాంట్ : గ్రామాల్లో పారిశుధ్యం, వీధిదీపాలు, తాగునీరు, క్లాప్‌మిత్ర, సిబ్బంది వేతనాలు

అన్‌టైడ్ గ్రాంట్: సిమెంట్ రోడ్లు, కాలువలు, వివిధ అభివృద్ధి పథకాలకు వినియోగం.

గత ఐదేళ్లలో ఇలా..

ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో సర్పంచులు, పంచాయతీల ప్రమేయం లేకుండానే సీఎఫ్ఎంఎస్ ఖాతా నుంచి నేరుగా డబ్బులు తీసుకుని జీరో బ్యాలెన్సు ఉంచింది. దీంతో సర్పంచులు ఆందోళనలకు దిగడంతో కేంద్రం పీఎఫ్ఎంఎస్ ఖాతాలు తెరచి, వాటిలో ఆర్థిక సంఘం నిధులను జమచేసింది. అయితే తీరు మార్చుకోని గత ప్రభుత్వం అందులోనూ 40శాతం నిధులు విద్యుత్ బకాయిలకు చెల్లించాలని కార్యదర్శులపై ఒత్తిడి తెచ్చింది. ఎంత కట్టారనేది లెక్క లేకపోవడంతో బకాయి భారం తగ్గేలా లేదంటూ సర్పంచులు ఆందోళన చెందారు.

ఉపాధి.. రైతులకు పెన్నిధి

వ్యవసాయానికి ఉపాధి నిధుల అనుసంధానం

నేటి గ్రామ సభల్లో పనుల గుర్తింపు



విప్లవాత్మక కార్యాచరణకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దశాబ్దాలుగా ఎదురుచూస్తూ ప్రతిపాదనలతో ఆగిపోయిన అంశాన్ని పరిష్కరించనుంది. వ్యవసాయ అనుబంధ పనులకు ఉపాధి నిధులను అనుసంధానం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న విధానం రైతుల జీవితాల్లో కొత్త వెలుగు నింపనుంది. పంచాయతీల్లో శుక్రవారం జరిగే గ్రామ సభలు.. రైతుల ఆకాంక్షలకు బాసటగా నిలవనున్నాయి.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

గ్రామ పంచాయతీలు: 697, ఉపాధి జాబ్ కార్డులు: 2,55,153
వేతనదారులు: 4,56,043, పనులకు హాజరవుతున్నవారు: 1,55,632
ఈ ఏడాది ఇంతవరకు జరిగిన చెల్లింపులు: రూ.127.64 కోట్లు
వేతనాలు: రూ.94.71 కోట్లు, మెటీరియల్ చెల్లింపులు: రూ.32.93 కోట్లు
వంద రోజులు పూర్తి చేసుకున్న కుటుంబాలు: 1,271
సగటు వేతనం: రూ.252

ఉపాధి నిధులతో చేపడుతున్న చెరువులు, సాగునీటి కాలువలు, మొక్కల పెంపకం వంటి పనులతో పాటు కొత్తగా ఈ ఏడాది వ్యవసాయంతో రైతులకు ఉపయోగపడే పనులను మంజూరు చేయనున్నారు. రైతుకు అవసరమైన పంట కాలువల నిర్మాణంతో పాటు పొలం గట్లపై మొక్కల పెంపకం, పొలంలో గుంతల తవ్వకం, సరిహద్దు కందకాలు నిర్మించుకోవడం, వ్యవసాయ బావుల నిర్మాణం, పండ్ల తోటల్లో రింగ్ ట్రెంచీల నిర్మాణం, గడ్డి పెంపకం, పండ్లు, పూలు, పట్టు పురుగులు, మల్బరీ తోటల పెంపకానికి నిధులు మంజూరు చేయనున్నారు. అలాగే, రాష్ట్ర ప్రభుత్వం మినీ గోకులాలను సైతం ఉపాధి నిధులతోనే మంజూరు చేయనుంది. దీనికోసం విధివిధానాలను పశుసంవర్థక శాఖ ప్రకటించింది. ఒక్క యూనిట్ విలువలో రైతు వాటాగా 10 శాతం చెల్లించాలి. రెండు పశువుల మినీ గోకులానికి రూ.1.15 లక్షలు, నాలుగు పశువులకు రూ.1.85 లక్షలు, ఆరింటికి రూ.2.30 లక్షలు మంజూరు చేయనున్నారు. గొర్రెలు, మేకల షెడ్లకు 20 జీవాలకు రూ.1.30 లక్షలు, 50 జీవాలకు రూ.2.30 లక్షలు మంజూరు చేయనున్నారు. కోళ్ల షెడ్లకు వంద కోళ్లకు రూ.87 వేలు, 200 కోళ్లకు రూ.1.32 లక్షలు అందిస్తారు. దీనికోసం అన్ని గ్రామ పంచాయతీల్లోనూ ఒకేసారి శుక్రవారం గ్రామ సభల్ని నిర్వహించనున్నారు. రైతులు తమ ప్రణాళికలు, అవసరాలను గ్రామ సభలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సి ఉంది. వీటిని అధికారులు పరిశీలించి పనులు మంజూరు చేస్తారు. జిల్లాలో పెద్దఎత్తున పాడి, తోటల పెంపకం, వ్యవసాయ అనుబంధ కార్యక్రమాలు పునరుద్ధరణ జరిగే అవకాశముంది.



చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

కలుషితాహార ఘటనలో

పెరిగిన బాధితులు

- ఇద్దరికి ఐసీయూలో.. మిగిలిన వారికి వార్డుల్లో వైద్యం
- విద్యార్థుల ఆరోగ్యం నిలకడగానే ఉందన్న డీఎంహెచ్‌వో

చిత్తూరు రూరల్, ఆగస్టు 22: చిత్తూరు అపోలో యూనివర్సిటీలో బుధవారం నాటి కలుషితాహార ఘటనలో బాధిత విద్యార్థుల సంఖ్య పెరిగింది. మెస్‌లో భోజనం చేసిన విద్యార్థులు నెమ్మదిగా అనారోగ్యానికి గురవుతూ ఆస్పత్రిలో చేరుతున్నారు. మొదటి రోజు 90 మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతుంటే ఆ సంఖ్య రెండోరోజుకు 200కు చేరింది. వీరిలో ఇద్దరు విద్యార్థులు ఐసీయూలో చికిత్స పొందుతుంటే మిగిలిన వారికి వార్డుల్లో వైద్యం అందిస్తున్నారు. వీరి కోసం ప్రత్యేక వార్డులను ఏర్పాటు చేసి వైద్యం అందిస్తున్నారు. 24 గంటల పాటు వైద్యులు అందుబాటులో ఉంటూ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. కాగా, అపోలో యూనివర్సిటీలోని 1300 మంది హాస్టల్ విద్యార్థులకు.. మూడు మెస్‌లు ఉన్నాయి. రెండు మెస్‌ల్లో భోజనం చేసిన వారికి ఫుడ్‌పాయిజన్ అయినట్లు విద్యార్థులు తెలుపుతున్నారు. 600 మందికి పైగా విద్యార్థులు వాంతులు, విరోచనాలు, జ్వరం బారీన పడ్డారు. మొదటి రోజు రాత్రి కొంత మందితో మొదలై రెండో రోజుకు 200 మందికి పైగా విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఇక, వర్సిటీకి నాలుగు రోజుల సెలవు ప్రకటించారు. కాగా, మెస్‌లో భోజనం బాగలేదని ఫిర్యాదు చేసినా యాజమాన్యం పట్టించుకోలేదని కళాశాలకు చెందిన కొంతమంది విద్యార్థులు ఆరోపించారు. గురువారం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను వారు పరామర్శించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వాలని, మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఆస్పత్రి ఎదుట ధర్నా చేసేందుకు విఫలప్రయత్నం చేశారు. అపోలో యాజమాన్యం వారితో మాట్లాడడంతో ధర్నా ఆలోచనను విరమించుకున్నారు. మరోవైపు అపోలో వర్సిటీలోని మెస్‌కు సంబంధించిన ఫొటోలంటూ కొన్ని సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. చాలాసార్లు విద్యార్థులకు వడ్డించిన భోజనం, సాంబారులో పురుగులు వచ్చాయని అందులో పేర్కొన్నారు.



అపోలో సూపరింటెండెంట్, వైద్యులకు సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌వో ప్రభావతి

నమూనాల సేకరణ

తిరుపతిలోని స్విమ్స్ మెడికల్ కళాశాలకు చెందిన రాపిడ్ రెస్పాన్స్ టీంలోని ఐదుగురు సభ్యులు అపోలోలోని మెస్‌ను తనిఖీ చేశారు. అక్కడున్న నీటి నమూనాను సేకరించారు. విద్యార్థులతో సమావేశమై ఘటన గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులతో మాట్లాడారు. మోషన్ శాంపిల్స్‌ను సేకరించారు.

అడ్మిన్ బ్లాక్‌లో నీరు కలుషితమైనట్లు గుర్తింపు

ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు బుధవారం అపోలో క్యాంపస్‌లో నాలుగు చోట్ల నీటిని సేకరించిన పరీక్షించారు. ఇందులో అడ్మిన్ బ్లాక్‌లో ఉన్న ఆర్వో ప్లాంట్‌లో నీరు కలుషితమైనట్లు గుర్తించినట్లు తెలిపారు. మిగిలిన చోట్ల నీరు బాగుందన్నారు.

నిర్లక్ష్యంగా ఆహార భద్రతా శాఖ

ఇంత పెద్ద ఘటన జరిగితే వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సమాచారం ఇస్తే కానీ ఆహార భద్రత శాఖ అధికారులకు విషయం తెలిలయలేదట. దీన్ని బట్టి వాళ్లు ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో ఇట్టే అర్థమవుతోంది. చివరగా వచ్చి హాస్టల్ మెస్‌లో కందిపప్పు, బియ్యం నమూనాలను తీసుకెళ్లినట్లు తెలిసింది.

నేడు పంచాయతీల్లో గ్రామసభలు

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 22: జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో శుక్రవారం గ్రామసభలు నిర్వహించి, గ్రామాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ నుంచి ఆర్డీవోలు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ప్రత్యేక అధికారులతో గ్రామసభల నిర్వహణపై టెలి కాన్ఫరెన్స్ ద్వారా పలు సూచనలు చేశారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో వంద రోజుల పనిదినాల కల్పనపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో రక్షిత మంచినీటి సరఫరా, కరెంట్ కనెక్షన్, మరుగుదొడ్ల సదుపాయం, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాలు, సీసీ రోడ్లు, పాఠశాలలు, ఆస్పత్రులలో మౌలిక సదుపాయాలు ఉండేలా చూడాలన్నారు. సీసీ రోడ్ల కనెక్టివిటీపై దృష్టి సారించాలన్నారు.

వచ్చేనెల 21 నుంచి

ఇసుక ఆన్‌లైన్ బుకింగ్

- అక్రమ రవాణా జరగకుండా గట్టి చర్యలు
- త్వరలో పలమనేరు, పుంగనూరు, కుప్పంలో ఇసుక డిపోలు
- కలెక్టర్, ఎస్పీ వెల్లడి

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 22: ఉచిత ఇసుకకు సంబంధించి వచ్చేనెల 21వ తేది నుంచి పూర్తిగా ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ విధానాన్ని అమల్లోకి తీసుకొస్తామని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో ఎస్పీ మణికంఠతో కలిసి ఆయన కొత్త ఇసుక విధానం గురించి మీడియాకు వివరించారు. జిల్లాలో ప్రస్తుతం మూడు డిపోల్లో 1,84,519 టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. రవాణా శాఖ, మైన్స్ తదితర అధికారులతో ఏర్పాటైన కమిటీ స్థిరమైన రవాణా ఛార్జితో కలిపి ఇసుకను అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ప్రతి పక్షం రోజులకోసారి డిపోల వద్ద ఉన్న ఇసుక నిల్వలను శాస్త్రీయంగా సర్వే చేస్తున్నామన్నారు. ఇప్పటివరకు 58 వేల టన్నుల ఇసుక అమ్మకం ద్వారా రూ.91లక్షలు వచ్చిందన్నారు. ఇంతవరకు 74 వాహనాలు సీజ్‌చేసి సుమారు రూ.3.50 లక్షల అపరాధ రుసుం వసూలు చేశామన్నారు. స్టాక్‌పాయింట్ల వద్ద సీసీకెమెరాలతో నిరంతర పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. వాహనదారులు జిల్లా కమిటీ నిర్ణయించిన ధరలకే ఇసుక కొనుగోలు చేయాలన్నారు. మరో 80 రోజుల వరకు అమ్మకానికి సరిపడా ఇసుక స్టాక్ పాయింట్లలో ఉందన్నారు. సచివాలయంలో నగదు చెల్లించి, రశీదు తీసుకుని ఇసుక రీచ్‌ల వద్ద కొనుగోలు చేయవచ్చన్నారు. త్వరలో పలమనేరు, పుంగనూరు, కుప్పంలలో స్థానిక వినియోగదారుల అవసరాన్ని గుర్తించి కొత్త డిపోలను ప్రారంభిస్తామన్నారు. ఎక్కడైనా ఇసుక అక్రమ రవాణా జరుగుతుంటే కంట్రోల్‌రూమ్ నెంబరు 9440796700కు ఫోను చేయాలని ఎస్పీ మణికంఠ సూచించారు. తనకు రోజుకు అన్ని రకాల ఫిర్యాదులు 60 నుంచి 70 మధ్య వస్తున్నాయని, వీటిని తానే పరిశీలిస్తున్నానని చెప్పారు. ఇతర రాష్ట్రాలకు టిప్పర్ల ద్వారా అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు. మొదటి సారి, రెండోసారి తప్పులు చేస్తే వార్నింగ్ ఇచ్చి వదిలేస్తున్నామని, మూడోసారి అదే తప్పు చేస్తే కేసులు నమోదు చేస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు 14 కేసులు నమోదు చేశామన్నారు. ఈ మీడియా సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, మైన్స్ శాఖ డీడీ ప్రసాద్, చిత్తూరు ఆర్డీవో చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



రవాణా చార్జీలతో ధరలిలా..

జీఎస్టీ, సీనరేజ్, ఎక్స్‌కవేటరుతో లోడింగ్, ఎన్విరాన్మెంట్ ట్యాక్స్ కలిపి టన్నుకు రూ.155 చెల్లించాలి. ఐదు టన్నుల ట్రాక్టర్ ఇసుక రవాణా తదితర చార్జీలతో దూరాన్ని బట్టి 10 కి.మీ వరకు రూ.1975, దూరం 15 కి.మీ.కు రూ.2175, దూరం 20 కి.మీ.కు రూ.2375, 25 కి.మీ.కి రూ.2575, 30కి.మీ. దూరానికి రూ.2775గా ధర నిర్ణయించినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు.



పోలీసు స్టేషను వద్ద మినీ లారీ, కారు

పోలీసుల అదుపులో వైసీపీ నేత?

టీడీపీ నేత కారును ఢీకొట్టించిన ఘటనలో ముందడుగు

గంగవరం, ఆగస్టు 22: టీడీపీ నేత కారును వెనుక నుంచి దుండగులు ఢీకొట్టించిన కేసులో బైరెడ్డిపల్లె మండలానికి చెందిన వైసీపీ నేతను గంగవరం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. మరో నలుగురూ అదుపులో ఉన్నట్లు సమాచారం. బైరెడ్డిపల్లె మండలం లక్కనపల్లెకు చెందిన టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి రఘుచంద్ర గుప్త వాహనాన్ని సోమవారం అర్ధరాత్రి గంగవరం మండల పరిధిలోని నాలుగురోడ్ల సర్కిల్ వద్ద మినీ లారీతో దుండగులు ఢీకొట్టి హత్యాయత్నానికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ కేసును పోలీసులు సీరియస్‌గా తీసుకుని దర్యాప్తు చేశారు. కాల్‌లిస్ట్ ఆధారంగా వైసీపీ నేతను అదుపులోకి తీసుకొని విచారించగా.. ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. విశ్వసనీయ సమాచారం మేరకు.. తనకు రాజకీయంగా రఘుచంద్రగుప్త అడ్డు వస్తున్నారని భావించి ఏడాదిన్నర కిందటే అతడిని హతమార్చాలని ఆ వైసీపీ నేత భావించినట్లు తెలిసింది. కోలార్‌కు చెందిన ఐడీపార్టీలో కీలకంగా వ్యవహరించే ఓ హెడ్‌కానిస్టేబుల్‌తో చర్చించగా, తన వద్ద కరడుగట్టిన నేరగాళ్లు ఉన్నారని వారితో అంతమొందిస్తామని అతడు చెప్పినట్లు సమాచారం. దీనికిగాను హెడ్ కానిస్టేబుల్‌కు రూ.10 లక్షల సుపారీ ఇచ్చి హత్య చేయడానికి ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం. ఏడాదిన్నర అయినా పని కాకపోవడంతో.. నెల కిందట ఆ హెడ్‌కానిస్టేబుల్‌ను వైసీపీ నేత కలిసి గట్టిగా హెచ్చరించినట్లు తెలిసింది. దీంతో ఆ హెడ్ కానిస్టేబుల్ ఓ చిల్లర ముఠాతో రూ.2 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం. ఆ ముఠా రఘుచంద్ర గుప్తా కదలికలపై నిఘా వేసింది. ఈ క్రమంలోనే తిరువణ్ణామలై దర్శనానికి వెళ్లి తిరిగొస్తున్న ఆయన కారును వెంబడించినట్లు తెలిసింది. నాలుగు రోడ్ల సర్కిల్ వద్ద మినీ లారీతో ఢీకొట్టి కారులోనే హతమార్చి, యాక్సిడెంటుగా చిత్రీకరించాలని పథకం పన్నినట్లు సమాచారం. వీరి ప్రయత్నం విఫలమైంది. ఈ క్రమంలో వైసీపీ నేతతో పాటు కోలార్ జిల్లాకు చెందిన హెడ్ కానిస్టేబుల్, మినీ లారీ డ్రైవర్ హా ఈ కేసులో సంబంధం ఉన్న మొత్తం ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వీరికి గురువారం రాత్రి పలమనేరు ప్రభుత్వాస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించారు. దీనిపై గంగవరం అర్బన్ సీఐకు ఫోన్ చేసి వివరణ కోరగా, తాను బిజీగా ఉన్నానని, ఇంకా ఏమి చెప్పలేమంటూ ఫోన్ పెట్టేశారు.

మండల స్థాయిలో ముగిసిన ఎస్ఏ సర్దుబాటు

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 22: విద్యాశాఖలో చేపట్టిన వర్క్ అడ్జస్ట్‌మెంట్ స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ) ప్రక్రియ మండల స్థాయిలో ముగిసింది. డివిజన్ స్థాయిలోకి వచ్చి సర్ప్లస్‌లోని టీచర్ల అభ్యంతరాలను గురువారం స్వీకరించారు. వీటి పరిశీలన, పరిష్కారం అనంతరం డివిజన్ స్థాయిలో ఎస్ఏల వర్క్ అడ్జస్ట్‌మెంట్ చేపట్టనున్నారు. ముగిసిన ప్రక్రియలో ఎస్ఏతో పాటు మెథడాలజీ ఎస్జీటీలను సైతం సర్దుబాటు చేశారు.

జన్మదినాన శ్రీవారి సన్నిధిలో



మెగాస్టార్ చిరంజీవి తన పుట్టినరోజు సందర్భంగా గురువారం కుటుంబ సమేతంగా తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. వేకువజామున సంప్రదాయ వస్త్రధారణతో సుప్రభాత సేవలో పాల్గొన్నారు.ఆలయం లోపల, బయట పలువురు యాత్రికులు చిరంజీవిని చూసి సంబరపడ్డారు. సెల్ఫీలు దిగేందుకు పోటీపడ్డారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

నేడు పాఠశాలల్లో జాతీయ అంతరిక్ష దినోత్సవం

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 22: చంద్రయాన్-3 విజయాన్ని గుర్తు చేస్తూ ఆగస్టు 23వ తేదీని భారత ప్రభుత్వం జాతీయ అంతరిక్ష దినంగా ప్రకటించింది. ఈ మేరకు జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో శుక్రవారం వేడుకలు నిర్వహించనున్నారు. అంతరిక్షానికి సంబంధించి విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేలా క్విజ్, చంద్రయాన్ నమూనా తయారీ, డ్రాయింగ్ పోటీలు నిర్వహించాలని విద్యాశాఖ అధికారులు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.



చంద్రయాన్-3 రాకెట్

● నేడు జాతీయ అంతరిక్ష దినోత్సవం

54 ఏళ్ల కిందట బుడిబుడి అడుగులతో ప్రారంభమైన భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) ప్రయాణం నేడు అంతర్జాతీయస్థాయిలో ప్రశంసలందుకునే స్థాయికి ఎదిగింది.ఇస్రో ప్రయోగించే రాకెట్ల నుంచి ఉపగ్రహాలను పంపేందుకు ఎన్నో దేశాలు క్యూ కడుతున్నాయి.1969లో తుంబా నుంచి చిన్నచిన్న సౌండింగ్ రాకెట్లతో ప్రయోగాలకు శ్రీకారం చుట్టిన ఇస్రో తొలి ఉపగ్రహం ఆర్యభట్ట ప్రయోగంతో నిర్ణయాత్మక దశకు చేరింది.అక్కడినుంచి చంద్రయాన్-3 ప్రయోగ విజయం వరకూ ఎన్నో మార్లు దేశ కీర్తి ప్రతిష్ఠలను ప్రపంచ దేశాలకు చాటిచెప్పింది.ఇస్రో చరిత్రలో గొప్ప మైలురాయి చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం కావడమే కాకుండా గత ఏడాది ఆగస్టు 23న చంద్రయాన్-3లో పంపిన ప్రజ్ఞాన్, రోవర్ చంద్రుడిపై సేఫ్‌గా ల్యాండ్ కావడంతో దేశంలో సంబరాలు ప్రారంభమయ్యాయి. దీంతో ఆ రోజును భారత ప్రభుత్వం జాతీయ అంతరిక్ష దినోత్సవంగా ప్రకటించింది.ఈ ఏడాది ఇస్రో, భారత ప్రభుత్వం, షార్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా అంతరిక్ష దినోత్సవాలను నెల రోజుల పాటు వివిధ ప్రాంతాల్లో నిర్వహించారు.శుక్రవారం న్యూఢిల్లీలో జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఇస్రో ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి పాల్గొంటారు.

షార్ ఎదిగిందిలా....

ఇస్రో విజయాల్లో శ్రీహరికోటలోని షార్‌కు ప్రముఖ పాత్రే వుంది. 1969లో శ్రీహరికోటను రాకెట్ కేంద్రంగా ప్రకటించారు 1971లో రోహిణి -125 సౌండింగ్ రాకెట్ ప్రయోగాత్మక పరీక్షలు జరపడంతో కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. 1969-79 మధ్యలో కాలంలో ఇక్కడ నుంచి ప్రయోగాలు చేసేందుకు అవసరమైన సౌకర్యాలను ఏర్పాటు చేసుకున్నారు.తొలిసారిగా 1979 ఆగస్టు 10న ఎస్ఎల్‌వీ రాకెట్ ప్రయోగం చేపట్టారు. 1987లో ఏఎస్ఎల్వీ, చిన్న ఉపగ్రహాలను పంపారు. 1993 సెప్టెంబరు 20న పీఎస్ఎల్వీ ప్రయోగాలకు ఇస్రో ఇక్కడినుంచే శ్రీకారం చుట్టింది.వరుస విజయాలను అందుకొని చరిత్ర సృష్టించింది. చంద్రయాన్-1 కూడా పీఎస్ఎల్వీ వాహక నౌక ద్వారానే ప్రయోగించడం విశేషం. అధిక బరువు గల ఉపగ్రహాలను పంపేందుకు 2001లో జీఎస్ఎల్వీ రాకెట్ ప్రయోగాలకు శ్రీకారం చుట్టింది. అనంతరం 2014లో జీఎస్ఎల్వీ-మార్క్ 3 ప్రయోగం చేపట్టింది. మళ్లీ ప్రయోగ ఖర్చును తగ్గించేందుకు 2022 ఆగస్టు 7న ఎస్ఎస్ఎల్వీ ప్రయోగాలకు శ్రీకారం చుట్టి వాణిజ్యపరంగా దూసుకెంది. ఇస్రో ఇప్పటికి ఆరు రకాల వాహక నౌకలు రూపొందించి 97 ప్రయోగాలు చేపట్టింది. చిన్న ప్రయోగాల నుంచి చంద్రయాన్-1, మంగళయాన్, ఆదిత్య-ఎల్ 1 వంటి భారీ ప్రయోగాలను విజయవం తంగా చేపట్టింది.చంద్రయాన్-2 చివరి నిమిషంలో విఫలమైనా చంద్రయాన్-3 ప్రయోగం ద్వారా సాఫ్ట్ ల్యాండింగ్ చేయడంలో శాస్త్రవేత్తలు విజయం సాధించారు. భవిష్యత్‌లో గగన్‌యాన్ ద్వారా మానవుడిని అంతరిక్షంలోకి పంపడమే ఇస్రో లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకు సంబంధించిన పలు పరీక్షలను విజయవంతంగా నిర్వహిస్తోంది.

- సూళ్లూరుపేట



సంకటహర గణపతి వ్రతాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.12 కోట్లు

తిరుమల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వరస్వామికి హుండీ ద్వారా రూ.4.12 కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు హుండీలో భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం లెక్కించింది.

25న అండర్-14 క్రికెట్ సెలెక్షన్స్

పలమనేరు, ఆగస్టు22 : పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో ఈ నెల 25వ తేదీ అండర్-14 క్రికెట్ క్రీడాకారుల ఎంపిక జరుగుతుందని స్థానిక క్రికెట్ కోచ్ బాలాజి తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు బి.విజయకుమార్ ఆదేశాల మేరకు 25వ తేదీ ఉదయం 10 గంటలకు క్రీడాకారుల ఎంపిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పలమనేరు, గంగవరం, పెద్దపంజాణి, బైరెడ్డిపల్లి, బంగారుపాళ్యం, చౌడేపల్లి మండలాలకు చెందిన క్రీడాకారులు మాత్రమే ఈ ఎంపికను సద్వినియోగం చేసుకోవాలని వివరించారు. క్రీడా కారులు తమ ఆధార్‌కార్డు, బర్త్ సర్టిఫికెట్, కిట్, తెల్లటిదుస్తులు ధరించి రావాలన్నారు. ఇతర వివరాలకు బాలాజి 7675843101, చిరంజీవి 9704023203 నంబర్లలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

వైభవంగా సంకటహర గణపతి వ్రతం

స్వర్ణ రథంపై ఊరేగిన వరసిద్ధుడు



ఆస్థాన మండపానికి ఉత్సవ విగ్రహాలను తీసుకొస్తున్న అధికారులు

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 22: కాణిపాకంలో గురువారం సంకటహర గణపతి వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం మూల విరాట్‌కు అభిషేకం చేశారు. సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధుడి ఉత్సవ విగ్రహాలను ఆలయ ఆస్థాన మండపంలో కొలువుదీర్చి విశేష పూజలు చేశారు. ఉత్సవ విగ్రహాల ఎదుట భక్తులను కూర్చోబెట్టి సంకటహర గణపతి వ్రతం నిర్వహించారు. ఈ వ్రతాన్ని ఆచరిస్తే కష్టాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం. రాత్రి ఉత్సవ విగ్రహాలను స్వర్ణరథంపై ఉంచి మాడ వీధులలో ఊరేగించారు. స్వామిని దర్శించుకోవడానికి వందలాది మంది భక్తులు తరలివచ్చారు. ఈవో వాణి, ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు రవి, విఘ్నేష్ పాల్గొన్నారు.



స్వర్ణరథంపై కొలువుదీరిన స్వామి వారు

తల్లి తిట్టిందని కూతురు ఆత్మహత్య

చిత్తూరు, ఆగస్టు 22: తల్లి తిట్టిందనే కోపంతో కూతురు ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం చిత్తూరు నగరంలో చోటుచేసుకుంది. రెండో పట్టణ ఎస్ఐ ప్రసాద్ వివరాల మేరకు... ఓబనపల్లెకు చెందిన రజియాకు ఇద్దరు కుమార్తెలు. ఇంట్లో పనులు చేయమంటే ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ ఘర్షణ పడేవారు. గురువారం ఇదే విషయమై పాతిమా(24) చెల్లితో గొడవపడింది. తల్లి ఇద్దరు కుమార్తెలను మందలించింది. అనంతరం ఆమె కూరగాయలు తీసుకురావడానికి బయటకు వెళ్లింది. చెల్లి కూడా వీధిలోకి వెళ్లిపోయింది. పాతిమా ఇంటి తలుపును మూసేసింది. నమాజు చేసుకోవడానికి మూసిందని అనుకున్నారు. ఎంత సేపటికీ తెరవకపోవడంతో అనుమానం వచ్చి తలుపును పగులగొట్టి లోపల చూసేసరికి ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతి చెందింది. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వరదయ్యపాళెం ఏఎస్ఐ సస్పెన్షన్

వరదయ్యపాళెం, ఆగస్టు 22: విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఏఎస్ఐ షణ్ముగాన్ని ఎస్పీ సుబ్బరాయుడు బుధవారం సస్పెండ్ చేశారు.వరదయ్యపాళెంలో గత ఆదివారం రాత్రి 10.45గంటలకు ఇందిరానగర్‌కు చెందిన ఇద్దరు యువకులు గొడవ పడ్డారు.వారిలో ఒకరు రాత్రి 11గంటల సమయంలో పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేయడానికి రాగా సెంట్రీ డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ ఈ విషయాన్ని స్టేషన్ ఇన్‌ఛార్జిగా ఉన్న ఏఎస్ఐ షణ్ముగానికి ఫోన్ ద్వారా తెలియజేశాడు.మరుసటి రోజు వచ్చి ఫిర్యాదు చేయాలని చెప్పాడు.సోమవారం సాయంత్రం కేసు నమోదు చేశారు.అయితే కేసు నమోదు విషయంలో షణ్ముగం నిర్లక్ష్యం చూపాడంటూ ఎస్పీ సుబ్బరాయుడికి బాధితులు ఫిర్యాదు చేశారు.ఫిర్యాదు స్వీకరించి విచారణ జరపకుండా నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించాడం, పై అధికారులకు తెలియజేయకుండా బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడమనే కారణాలతో ఏఎస్ఐ షణ్ముగాన్ని ఎస్పీ సుబ్బరాయుడు సస్పెండ్ చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎవరిపైన అయినా కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.

మున్సిపాలిటీ వారి హెచ్చరిక

● అక్రమ లే అవుట్లలో ఎలాంటి నిర్మాణాలకు అనుమతించమంటూ బోర్డుల ఏర్పాటు

పలమనేరు, ఆగస్టు 22: 'అక్రమ లే అవుట్లలో క్రయ విక్రయాలు నేరం. వీటిల్లో ఎటువంటి నిర్మాణాలకు అనుమతించం' అంటూ పలమనేరు మున్సిపాలిటీలోని అక్రమ లేఅవుట్లలో గురువారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. సిబ్బందితో కలిసి కమిషనరు రమణారెడ్డి వీటిని ఏర్పాటు చేయించారు. అక్రమ లే అవుట్లు వేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చాక పట్టణ ప్రాంతాల్లోని అక్రమ లేఅవుట్లపై చర్యలకు ఉపక్రమించింది. పంచాయతీ, మున్సిపాలిటీ, కార్పొరేషన్ పరిధిలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పుట్టగొడుగుల్లా రియల్టర్లు అక్రమ లే అవుట్లు వేసి రూ.కోట్లు సొమ్ము చేసుకున్నారు. ఇందులో ప్రభుత్వ భూములు, ఎస్సీలకు కేటాయించిన అసైన్డు భూములనూ తమ లే అవుట్లలో కలిపేసి అమ్మేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పలమనేరులో మున్సిపల్ అధికారులు వీటిపై విచారించారు. కేవలం మూడు లేఅవుట్లు మాత్రమే అప్రూవ్ అయినట్లు గుర్తించారు. ఇందులో శ్రీనాథ్‌లే అవుట్ 2009లోను, జేఎస్ నగర్ లే అవుట్ 2004లోను, రమాగార్డెన్స్ లే అవుట్ 2014లోను అప్రూవ్ అయ్యాయని అధికారులు తెలిపారు. ఇక 36 లే అవుట్లు అక్రమంగా వెలిసినట్లు గుర్తించారు. వీటిలోని 53.98 ఎకరాల మేర రియల్టర్లు నివేశస్థలాలుగా వేసినట్లు అధికారులు తెలిపారు. ఇందులో కొన్ని లే అవుట్లలో 50 నుంచి 70 శాతం పైగా నివేశస్థలాలను విక్రయించేశారు.



ఇలా కొన్న వారిలోనూ కొందరు ప్లాట్లను అమ్మేసినట్లు అధికారులు గుర్తించారు. అంటే.. కొన్ని ప్లాట్లు ముగ్గురు, నలుగురు చేతులు మారాయన్న మాట.

అక్రమ లే అవుట్లలో ఇళ్లు కట్టుకోవాలంటే..

ఇలా అక్రమ లే అవుట్లలో నివేశస్థలాలు కొని ఎవరైనా తప్పనిసరి పరిస్థితిలో ఇల్లు నిర్మించుకోవాలంటే వారు మున్సిపాలిటీకి స్థలం కొనుగోలు ధరలో (ఇప్పుడున్న ధర మేరకు) బెటర్మెంట్‌ఛార్జీ కింద 14.5 శాతం మేరకు కట్టాలి. వీటికి తోడు మున్సిపాలిటీ నిబంధనల మేరకు లే అవుట్లలో కనీసం లోపలి రోడ్డు 35 అడుగుల వెడల్పు ఉండాలి. దీంతో అక్రమ లే అవుట్లలో కేవలం 20 అడుగుల మేర రోడ్డు వుంటే మిగిలిన 15 అడుగులు నివేశస్థలం కొనుగోలుదారు తమ స్థలం వదిలి మిగిలిన స్థలంలో నిబంధనలమేరకు ఇల్లు నిర్మించుకోవాలి. ఇక ఉద్యోగులు అయితే అక్రమ లే అవుట్‌లో కొన్న నివేశస్థలంలో ఇళ్లు నిర్మించు కొనేందుకు బ్యాంకులవద్దకు వెళ్తే వారికి రుణం దొరకడం కూడా కష్టమే. అందువల్ల ప్రభుత్వం, అధికారులు అక్రమ లే అవుట్లలో నివేశస్థలాలు కొనవద్దని ప్రజలను హెచ్చరిస్తున్నారు. ఆ మేరకు బోర్డులు ఏర్పాటు చేశారు.

రూ.50 లక్షల లిక్విడ్ గంజాయి స్వాధీనం

కారు సీజ్- పరారైన ముగ్గురు నిందితుల కోసం గాలింపు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 22: తిరుపతిలో పోలీసులు దాదాపు 50 లక్షల విలువ చేసే లిక్విడ్ గంజాయిని గురువారం మధ్యాహ్నం ఓ కారుతోపాటు స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి రూరల్ సీఐ సాధిక్ ఆలి తెలిపిన వివరాల మేరకు.. కేఎల్71-డీ 3686 నెంబరుతో ఉన్న కారులో లిక్విడ్ గంజాయి భారీ ఎత్తున తీసుకెళుతున్నారని పోలీసులకు ముందస్తు సమాచారం అందిం ది. దీంతో ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాలతో రూరల్ సీఐతోపాటు ఎస్ఐలు షేక్ షావలి, నాగేంద్రబాబు తమ సిబ్బందితో కలసి నాయుడుపేట- పూతలపట్టు జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తున్నారు. చిత్తూరు వైపు వెళుతున్న ఈ కారులోని వారు పోలీసులను చూసి పరారవడానికి ప్రయత్నించారు. పోలీసులు వెంబడించడంలో కారును రామానుజపల్లె సర్కిల్ వద్ద వదిలి, అందులోని ముగ్గురు పరారయ్యారు. కారును పరిశీలించగా డిక్కీ, డ్రైవర్ సీటు వెనుక లిక్విడ్ గంజాయి మూటలు బయటపడ్డాయి. వీటి విలువ సుమారుగా రూ.50 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. పరారైన ముగ్గురు నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నారు. ఈ తనిఖీల్లో ఏఎస్ఐ రాఘవ, తదితరులు పాల్గొన్నారు.



లిక్విడ్ గంజాయిని మీడియాకు చూపుతున్న సీఐ సాధిక్ ఆలి

పాఠశాలలో అగ్నిప్రమాదం

పాత ఫర్నిచర్ దగ్ధం, రూ.లక్ష ఆస్తి నష్టం

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 22: ఓ పాఠశాలలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం జరిగింది. పాత ఫర్నిచర్ దగ్ధమైంది. సకాలంలో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పేయడంతో విద్యార్థులకు పెను ప్రమాదం తప్పింది. స్థానికులు, అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపిన వివరాల మేరకు.. బైరాగిపట్టెడలోని సోక్రటీస్ పాఠశాలలో గురువారం ఉదయం తరగతులు జరుగుతున్న సమయంలో అకస్మాత్తుగా భవనం నాల్గవ అంతస్తు నుంచి మంటలు ఎగసి పడ్డాయి. ఉపాధ్యాయులు, సిబ్బంది భవనంపైకి వెళ్లి చూడగా.. అక్కడున్న గదిలో వాటర్ సరఫరా కోసం ఏర్పాటు చేసిన మోటారు వైర్లలో షార్టుసర్క్యూట్ జరిగి మంటలు చెలరేగినట్లు గుర్తించారు. అక్కడున్న పాత ఫర్నిచర్, చిత్తు కాగితాలకు మంటలు వ్యాపించాయి. ఈ సమాచారం అందుకున్న అగ్నిమాపక అధికారులు వెంటనే ఫైరింజన్‌తో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేయడంతో విద్యార్థులకు ప్రమాదం తప్పింది. అప్పటికే విద్యార్థులను పాఠశాల తరగతి గదుల నుంచి బయటకు పంపేశారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులూ పాఠశాల వద్దకు చేరుకున్నారు. పిల్లలు సురక్షితంగా ఉండటంతో ఇళ్లకు తీసుకెళ్లిపోయారు. కాగా, పాఠశాలలో ఫైర్ ఫైటింగ్ పరికరాలు లేకపోవడంపై అగ్నిమాపక సిబ్బంది అసంతృప్తి వ్యక్తం చేశారు.





పోలీస్‌స్టేషన్‌లో కొట్టుకుంటుండగా అడ్డుకుంటున్న పోలీసులు

పోలీసుల ఎదుటే డిష్యుం.. డిష్యుం

కొందరికి గాయాలు

పాత కక్షలతో రెండు కుటుంబాల మధ్య ఘర్షణ

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 22: పోలీసుల ఎదుటే రెండు కుటుంబాలకు చెందిన 15 మంది కొట్టుకున్నారు. కొందరు గాయపడ్డారు. తిరుపతి రూరల్ సర్కిల్ స్టేషన్ వద్ద గురువారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. తిరుపతి రూరల్ పరిధిలోని కాలూరుకు చెందిన గోపి అతని కుమారుడు వెంకటకిరణ్, పక్కింటిలో కాపురముంటూ గ్యాస్ సరఫరా చేస్తున్న జానకిరాం మధ్య పాత కక్షలున్నాయి. కొద్ది రోజులుగా వీరి మధ్య విభేదాలు తారస్థాయికి చేరాయి. ఈ క్రమంలో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వచ్చిన జానకిరాంను మరో వర్గానికి చెందిన వారు స్టేషన్ ఎదుటే దుర్భాషలాడారు. మాటామాటా పెరిగి స్టేషన్ వద్ద ఎస్ఐ షేక్ షావలి, సిబ్బంది ఎదుట కొట్టుకోవడం మొదలు పెట్టారు. అక్కడున్న పోలీసులు వారిని వారించే ప్రయత్నం చేసినా పట్టించుకోకుండా మహిళలు, పురుషులూ కొట్లాటకు దిగారు. ఓ మహిళ కిందపడ్డారు. కొందరు గాయపడ్డారు. మహిళలపై ఎస్ఐ ఎదుటే దౌర్జన్యానికి దిగిన ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు విచారిస్తున్నామని ఎస్ఐ నాగేంద్రబాబు తెలిపారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

అండగా ఉంటాం: మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి


మంత్రి రాంప్రసాద్‌రెడ్డితో చల్లాబాబు

రొంపిచెర్ల, ఆగస్టు22: టీడీపీ నాయకులు, కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా తాము అండగా ఉంటామని మంత్రి మండిపల్లె రామప్రసాద్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన తిరుపతిలో ఓ శుభకార్యానికి వెళుతూ మార్గమధ్యంలోని రొంపిచెర్ల క్రాస్‌లోని పుంగ నూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి ఇంటికి వచ్చారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు మంత్రికి పూల మాలలు వేసి శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఉయ్యాల రమణ, ఈఎం.రత్నం, షేక్ కరీముల్లా, ఇమ్రాన్‌ఖాన్, రామమూర్తి, పులిచెర్ల మాజీ జడ్పీటీసీ మురళీధర్, రవినాయుడు, కిరణ్, శివశంకర, మణియాదవ్ పాల్గొన్నారు.

కొలమాసనపల్లిలో టీడీపీ కార్యాలయం ప్రారంభం



పలమనేరు, ఆగస్టు22 : కొలమాసనపల్లి పంచాయతీ కేంద్రంలో గురువారం టీడీపీ కార్యాలయం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు వెంకటరత్నం, మాజీ సర్పంచ్ సెల్వరాజ్, రామ్మూర్తినాయుడు, గణేష్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక, శారీరక ఆరోగ్యం

కుప్పం, ఆగస్టు 22: యువతలో మానసిక, శారీక దృఢత్వం, ఆరోగ్యం క్రీడలతోనే సాధ్యమవుతుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పి.గోపీనాథ్ అన్నారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో గురువారం ఎస్‌పీఎల్ కొత్తపేట క్రికెట్ ప్రీమియర్ లీగ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయ మాట్లా డుతూ క్రీడాకారులను, యువతను ప్రోత్సహించడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుం టారని చెప్పారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట టీడీపీ నాయకుడు అప్పు ముఖేశ్, లయన్స్ క్లబ్ ప్రతినిధి మహేశ్, ప్రసన్న తిరుపతి గంగమ్మ గుడి మాజీ ఛైర్మన్ ఆర్‌ఆర్.రవి, టీడీపీ విస్తరణ కమిటీ సభ్యుడు మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవం

బైరెడ్డిపల్లె, ఆగస్టు 22 : మండలంలోని తీర్థంగ్రామంలో కొలువైన రాఘవేంద్ర స్వామి ఆలయంలో గురువారం ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. అర్చకులు రమేష్ ఆచార్యులు స్వామివారికి అభిషేకంచేసి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ విగ్రహానికి విశేషాలంకరణ చేసి ప్రాకారోత్సవం నిర్వహించారు. పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. గురురాజా సేవాసమితి అధ్యక్షుడు మురళీధరరావు, సభ్యులు శ్రీనివాసమూర్తి, మోహన, రాజేష్, గోపాల్, మధు, వేదవ్యాస్, మురళీధ రాచార్యులు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అమరావతి కాలనీకి బస్సు సర్వీసు ప్రారంభం



బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల, పీఎస్ఎం తదితరులు

కుప్పం, ఆగస్టు 22: కుప్పం పుర పాలక సంఘం పరిధిలోని అమరావతి కాలనీకి నూతన బస్సు సర్వీసును గురువారం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నియోజక వర్గ ఇన్‌ఛార్జి పీఎస్. మునిరత్నం, టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ ప్రారంభించారు. కుప్పం ఆర్టీసీ బస్టాండునుంచి డీకేపల్లె మీదుగా ఈ బస్సు అమరావతి కాలనీకి చేరుతుంది. తిరిగి ఇదే మార్గంలో బస్టాండుకు వస్తుంది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో మారుమూల పల్లెలకు సైతం ఆర్టీసీ నూతన సర్వీసులను ప్రారంభి స్తోందని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకం అవసరం

గుడుపల్లె, ఆగస్టు 22: పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకం ఎంతో అవసరమని ఉపాధి హామీ జేఈ సోమశేఖర్ పేర్కొన్నారు. 'ప్లాంట్ ఫర్ మదర్' కార్యక్రమంలో భాగంగా మండలంలోని గ్రామాల మహిళలకు మొక్కలు అందించారు. ఆ తరువాత పలు గ్రామాల్లో ఇళ్ల ఆవ రణలో మొక్కలు నాటి నీరుపోశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొక్కలను సరంక్షిం చాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఏలు మునిరత్నం, సుబ్రహ్మణ్యం, వెంకటేష్, ఎఫ్ఏలు వెంకటాచలం, గజేంద్ర, బాలాజీ, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉపాధి హామీ గ్రామసభలు

పుంగనూరు రూరల్, ఆగస్టు22: మండలంలోని గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద ఉపాధి పనుల నిర్వహణపై శుక్రవారం గ్రామ సభలు నిర్వహించనున్నట్లు పుంగనూరు ఇన్‌చార్జి ఎంపీడీవో అబ్దుల్‌రహీం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు అవసరమైన పనులు గుర్తించి చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు. గ్రామసభలో ఎంపిక చేసిన పనులను మాత్రమే చేపడుతామని తెలియజేశారు.

పలమనేరు: మండలంలోని 10 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ కింద చేపట్టదలచిన పనులకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేసేందుకు శుక్రవారం గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాజేష్ తెలిపారు. పంచాయతీ కేంద్రంలో ఈ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

చౌడేపల్లె: మండలంలోని అన్ని పంచాయతీల్లో జరిగే గ్రామ సభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో కృష్ణవేణి పేర్కొన్నారు.

సింగిరిగుంటలో నాగరాళ్ల ప్రతిష్ఠ

పుంగనూరు రూరల్, ఆగస్టు22: మండలంలోని సింగిరి గుంట గ్రామంలో నాగరాళ్లను ప్రతిష్ఠించారు. గురువారం తెల్లవారుజామున వేదపండితులు గణపతి పూజ, హోమాలు చేసి ప్రతిష్ఠించారు. గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు.

రోగుల కాలక్షేపం కోసం టీవీ ఏర్పాటు

పలమనేరు, ఆగస్టు22 : పలమనేరు వందపడకల ప్రభుత్వ ఆస్పత్రిలో రోగుల కాలక్షేపం కోసం టీవీని ఏర్పాటు చేశారు స్థానిక సీనియర్ న్యాయవాది పరమశివప్ప టాటా స్కై ఏర్పాటు చేయించారు.

మహిళల ఆర్థిక స్వావలంబనకు శ్రీకారం చుట్టింది చంద్రబాబే


సమావేశంలో మాట్లాడుతున్న విశ్వనాథనాయుడు

రామకుప్పం, ఆగస్టు 22: తెలుగు రాష్ట్రాల్లో మహిళల ఆర్థిక స్వావలంబనకు శ్రీకారం చుట్టిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కిందని టీడీపీ శాంతిపురం మండల అధ్యక్షుడు విశ్వనాథనాయుడు తెలిపారు. గురువారం మండల పరిధి బోయనపల్లెలో జరిగిన గ్రామ సమాఖ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం మహిళలు ఆర్థికంగా ఎదిగేలా సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. డ్వాక్రా సంఘాల సభ్యులు ప్రభుత్వం అందిచే ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో వెలుగు అధికారులు పాల్గొన్నారు.

26న విష్ణుపురిలో కృష్ణాష్టమి వేడుకలు

పలమనేరు, ఆగస్టు22 : పలమనేరు సమీపంలోని విష్ణుపురిలో వెలసిన నిర్వాణనారాయణ స్వామి ఆలయంలో ఈనెల 26న కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త భోగనాథం సురేష్ తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు ఈ వేడుకల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

దళితుల భూమి ఆక్రమించారని నిరసన

బైరెడ్డిపల్లె, ఆగస్టు 22: మండలంలోని చిన్నచెల్లారగుంట గ్రామంలో దళితులకు చెందిన భూమిని కొందరు అగ్ర కులస్తులు ఆక్రమించారని గురువారం గ్రామంలో దళితులతో కలసి ఎమ్మార్పీఎస్ నాయకులు నిరసన తెలిపారు. దీనిపై రెవిన్యూ అధికారులకు ఎన్నిసార్లు విన్న వించినా తమకు న్యాయం చేయలేదని దళితులు ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

ఓటురుగా నమోదు చేసుకోండి

చౌడేపల్లె, ఆగస్టు22: వచ్చే ఏడాది జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండే ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ హనుమంత్‌నాయక్ పేర్కొన్నారు. గురువారం ఆయనతోపాటు వీఆర్‌వోలు, బీఎల్‌వోలు కలెక్టర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క బీఎల్‌వో ఇంటింటా సర్వే చేయాలన్నారు.

టెన్నికాయిట్ జిల్లా జట్ల ఎంపిక



సోమల, ఆగస్టు 22: రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్స్ టెన్నికాయిట్ పోటీలకు జిల్లా జట్లను ఎంపిక చేసినట్లు జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ కార్యదర్శి చిన్నప్ప తెలిపారు. శ్రీకాకుళం జిల్లా పలాసలో సెప్టెంబరు 14, 15, 16 తేదీలో అంతర్ జిల్లాల టెన్నికాయిట్ పోటీలు జరుగుతాయని వివరించారు. సోమల హైస్కూల్‌లో శుక్రవారం జిల్లా జట్లను ఎంపిక చేశారు. బాలికల విభాగంలో ఐశ్వయ్య (సోమల), భార్గవి (సోమల), బి.గాయత్రి (చిల్లమాకులపల్లె),చార్మి (చిలమాకులపల్లె) ఎంపికయ్యారు. బాలుర విభాగంలో మహమ్మద్ అఫ్రోజ్ (సోమల) సుజైన్ (సోమల) శివ ప్రసాద్ (విజయవాణి - చౌడేపల్లె) సుదీప్ (కోటపల్లె పీలేరు)లను ఎంపిక చేసినట్లు ఆర్గనైజింగ్ కార్యదర్శి కరుణానిధి తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఎంఈవో శివరత్న, హెచ్‌ఎం హరినాథ్, ఉపాధ్యాయులు జ్యోతీశ్వరుడు, రామాంజులు, అరుణశ్రీ, షర్మిళభాను అభినందించారు.

మృత్యుంజయేశ్వరుడికి రూ.52 వేల ఆదాయం

చౌడేపల్లె, ఆగస్టు22: స్థానిక బజారు వీధిలో కొలువైన అభీష్టద మృత్యుం జయేశ్వర స్వామికి హుండీ లెక్కింపు ద్వారా రూ.52 వేలు ఆదాయం చేకూరినట్లు గ్రూప్ టెంపుల్స్ ఈవో కమలాకర్ పేర్కొన్నారు. ఈ ఆదాయన్ని పుంగనూరు ఇండియన్ బ్యాంకులో డిపాజిట్ చేసినట్లు తెలిపారు. గ్రూప్ టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్‌రెడ్డి, ఆలయ అర్చకులు రాజశేఖర్ దీక్షితులు, కుమార్‌దీక్షితులు, మహేష్‌దీక్షితులు, స్థానికులు పాల్గొన్నారు.

మహిళా మార్ట్‌కు మంగళం..?

- పుంగనూరు మార్ట్‌లో అధిక ధరలు
- 8 నెలలుగా అంతంతమాత్రంగానే వ్యాపారం
- రూ.12లక్షలు అద్దె బకాయి
- మార్ట్‌ను మూసేయాలని సభ్యుల తీర్మానం



పుంగనూరు, ఆగస్టు 23: పుంగనూరులో మెప్మా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జగనన్న మహిళా మార్ట్‌ను మూసేయాలని స్వయం సహాయక సంఘ సభ్యులు ఇటీవల ఏకగ్రీవ తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపారు. ఎస్‌ఎస్‌జీ గ్రూపు సభ్యుల పెట్టుబడితో మహిళామార్టు ఏర్పాటు చేసి తద్వారా వచ్చిన ఆదాయాన్ని మహిళలకే అందించాలని పుంగనూరు, తిరుపతి, చిత్తూరు, పుత్తూరులో ఏర్పాటు చేశారు. పుంగనూరులో 2022 మార్చి 19న నాటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అట్టహాసంగా మార్ట్‌ను ప్రారంభించారు. పట్టణంలో మొత్తం 1089 సంఘాలుండగా 11వేల మంది మహిళా సభ్యులున్నారు. వీరిలో 890 గ్రూపుల్లోని 8930 మంది సభ్యులు ఒక్కొక్కరు రూ.300 చొప్పున మార్టుకు పెట్టుబడిగా రూ.26.79 లక్షలు వెచ్చించారు. మూలధనం నుంచి మార్ట్ ఏర్పాటుకు రూ.7లక్షలు, సరుకులకు రూ.18 లక్షలు ఖర్చుపెట్టారు. స్థానిక వారపుసంతలోని మున్సిపల్ షాపింగ్ గదులను మార్ట్‌కు వీలుగా తయారు చేయించి కమిషనర్ నెలకు రూ. 35,400 చొప్పున అద్దె నిర్ణయించారు. ప్రతినెలా కరెం టు బిల్లు రూ.3,700, ఇంటర్‌నెట్ బిల్లు రూ.1202 చెల్లిస్తున్నారు. మహిళా సంఘంలోని ప్రతి సభ్యురాలు విధిగా ప్రతినెలా రూ.300 నుం చి రూ. 1000 వరకు సరు కులు కొను గోలు చేసే వారు. ఒక రోజు అత్య ధికంగా రూ. 2.16 లక్షల వ్యాపారం జరగ్గా కొంత కాలంగా రూ.1600లకు పడి పోయింది.

బయట కంటే అధిక ధరలు

మార్ట్ కంటే బయట దుకాణాల్లో జీఎస్టీ కాకుండా తక్కువ ధరలకు వస్తువులు లభ్యమవుతుండగా మార్ట్‌లో మాత్రం జీఎస్టీతో కలిపి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. రుణాల మంజూరులో ఇబ్బంది పెడతారనే భయంతో ధర ఎక్కువగా ఉన్నా మహిళలు మార్ట్‌లో కొనుగోళ్లు చేశారు. కానీ ఈఏడాది జనవరి నుంచి ఎన్నికల నేపథ్యంలో మార్టులో కొనుగోళ్లపై మహిళా సంఘాలపై ఒత్తిళ్లు చేయరాదని వైసీపీ నేతలు మెప్మా అధికారులను ఆదేశించడంతో కొనుగోల్లు లేక మార్టు వెలవెలబోతోంది.

అద్దె బకాయిలు రూ.12లక్షలు

2022 మార్చి నుంచి నేటి వరకు కేవలం రెండు నెలలు మాత్రమే మున్సిపాలిటీకి మెప్మా అధికారులు అద్దె చెల్లించారు. బకాయి రూ.12 లక్షలు ఉంది. దీనిపై ఇటీవలే మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి నోటీసు ఇచ్చారు.

మార్ట్ చార్జి ఇవ్వని మెప్మా సీఎంఎం

ప్రారంభం నుంచి నాటి మెప్మా సీఎంఎం జి.రవి ఆధ్వర్యంలో మార్ట్ నిర్వహణ జరిగేది. ఇద్దరు సీసీలను పర్యవేక్షణకు పెట్టారు. అదే ఏడాది జూలై నాలుగో తేదీ సీఎంఎం రవి బదిలీ కాగా మధుసూదన్‌రెడ్డి వచ్చారు. బదిలీ అయిన రవి మహిళామార్ట్ ఏర్పాటుకు సంబంధించి కొనుగోళ్లు, లావాదేవీలు, పెట్టుబడి, వస్తువులు తదితర వివరాలను నూతన సీఎంఎం మధుసూదన్‌రెడ్డికి ఇవ్వలేదు. దీనిపై మధుసూదన్‌రెడ్డి తిరుపతి మెప్మా పీడీకి ఫిర్యాదు చేశారు.

అవకతవకలు జరిగాయనే ఆరోపణలు

మార్ట్‌లో ఆడిట్ జరగలేదని కొన్నింటిలో అవకతవకలున్నాయని సమాచారం. నిధుల దుర్వినియోగం జరిగినట్లు ఆరోపణలున్నాయి. రూ.300 చొప్పున పెట్టుబడి పెట్టిన మహిళలకు ఇదివరకే ఒక్కొరికి రూ.100 చొప్పున అందజేశారు. సీఎంఎం పర్యవేక్షణ లేకుండానే మార్టు నడుస్తోంది. ఆదాయం లేకుండా నిర్వ హణ భారం అధికమవుతుండటంతో మహిళా మార్టును ఎత్తివేయాలని సభ్యులు తీర్మానించారు. ఈ క్రమంలో త్వరలోనే మార్ట్ మూసి వేయనున్నట్లు సమాచారం. కాగా ప్రస్తుతం మార్ట్ ప్రాఫిట్‌కు సంబంధించి గ్రామీణ బ్యాంక్‌లో రూ.1,24,449, ఇండియన్ బ్యాంక్ కరెంట్ అకౌంట్‌లో రూ.95,426 నిల్వఉంది.

కోల్‌కతా హత్యాచారంపై నిరసన



పలమనేరు, ఆగస్టు22 : కోల్‌కతాలో డాక్టర్‌పై అత్యాచారం, హత్యను నిరసిస్తూ పలమనేరు అంబేడ్కర్ విగ్రహం వద్ద ఐద్వా, సీఐటీయూ, కులవివక్ష పోరాట సమితి, ఆశ, యూనియన్ల నాయ కులు, కార్యకర్తలు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో రోజురోజుకూ అత్యాచారాలు, హత్యలు పెరుగుతున్నా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించు కోలేదని విమర్శించారు. జరిగిన సంఘటనకు బాధ్యత వహిస్తూ తక్షణమే బెంగాల్ ముఖ్య మంత్రి, హోం మంత్రులు రాజీనామా చేయాలని డిమాండు చేశారు. ఈ సంఘటనలో దోషు లను కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భువనేశ్వరి, ఓబుల్‌రాజు, గిరిధర గుప్తా, ఈశ్వర్, జయంతి, ధనమ్మ, సావిత్రి, ఖైరున్నీసా, మంగమ్మ, రాజా, లక్ష్మయ్య పాల్గొన్నారు.

భూసార పరీక్షల తర్వాత ఎరువులు వేయండి


టమోటా తోటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

సోమల, ఆగస్టు 22: భూసార పరీక్షలు చేశాక అవసరమైన ఎరువులు వినియోగించాలని ఏరువాక శాస్త్రవేత్త సంధ్యారాణి సూచించారు. గురువారం చిన్న ఉప్పరపల్లెలో జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు నాగపద్మిని మాట్లాడుతూ వాతావరణ ఆధారిత పంటల సాగు, ప్రకృతి వ్యవ సాయం, వరిపంటలో యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవ సా యం చేయాలన్నారు. టమోటా, వంగ తోటలను సందర్శించి రసం పీల్చే పురుగుల నివారణ పద్ధతులు వివరించారు. సరస్వతీపురంలోని రైతు మహేశ్ ప్రకృతి వ్యవసాయంలో సాగుచేస్తున్న పంటలను పరి శీలించారు. వ్యవసాయాధికారి సుధాకర్ మాట్లాడుతూ రైతులు సాగు చేసిన పంటల వివరాలను ఈ- పంట యాప్‌లో నమోదు చేయాలని కోరారు. 90శాతం రాయితీతో అందజేస్తున్న బిందు సేద్య పరికరాలపై పలు సూచనలు చేశారు. రైతు సేవా కేంద్రం ఏవీవీలు కుమార్, మంజునాథ్, మాజీ ఎంపీటీసీ రమేశ్‌నాయుడు, జనసేన నాగభూషణం రాయల్, రైతులు పాల్గొన్నారు.

వృక్షసంపదను పెంపొందించుకోవాలి


కెంపసముద్రంలో మొక్కలు నాటే కార్యక్రమంలో మాజీ ఎంపీపీ హేమలతారెడ్డి

రామకుప్పం, ఆగస్టు 22: ప్రతి గ్రామంలో వృక్షసంపదను పెంపొందించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పట్ర నారాయణాచారి, మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ అధ్యక్షుడు ఆంజినేయరెడ్డి, మాజీ ఎంపీపీ ఆంజినేయరెడ్డి, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, మాజీ వైస్ఎంపీ చిన్నకృష్ణలు కోరారు. గురువారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో వారు ఎన్ఆర్‌జీఎస్‌లో భాగంగా మదర్ ప్లాంటేషన్ కార్యక్రమాల్లో పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానురానూ వృక్షసంపద తగ్గిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దీని వల్ల వర్షాలు సక్రమంగా కురవక పోవడంతో పాటు కాలుష్య ముప్పు ఏర్పడిందన్నారు. ఏపీఓ రవికుమార్ పాల్గొన్నారు.

గ్రామ సభలు విజయవంతం చేయాలి

రొంపిచెర్ల, ఆగస్టు 22: పుంగనూరు నియోజక వర్గంలోని పంచాయతీ కేంద్రాల వద్ద జరిగే గ్రామ సభలను టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు కలిసి విజయవంతం చేయాలని టీడీపీ ఇన్ చార్జి చల్లా రామచంద్రారెడ్డి కోరారు. ఆయన గురువారం విలేకర్లతో మాట్లాడుతూ ఈ గ్రామ సభలలో ఉపాధి పనుల ద్వారా చేపట్టాల్సిన పనులను ప్రజలతో కలిసి నిర్ణయం తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పనిదినాలు పెంచాలని కోరారు.

పంచాయతీలకు నిధుల మంజూరు

రొంపిచెర్ల, ఆగస్టు22: మండలంలోని పది పంచాయతీలకు నిధులు మంజూరైనట్లు గురువారం ఈవోపీఆర్‌డీ నాగరాజ తెలిపారు. పంచాయతీల వారీగా బండకిందపల్లె పంచా యతీకి రూ.1,69,019లు, బోడిపాటివారిపల్లెకు రూ.2,47,829, చెంచమరెడ్డిగారిపల్లెకు రూ.2,48,260, చిచ్చిలివారిపల్లెకు రూ.4,55, 992, గానుగచింతకు రూ.5,65,013, జాండ్లవారిపల్లెకు రూ.2,22,775, మోటమల్లెలకు రూ.5,79,822, పెద్దగొట్టిగల్లుకు రూ.2,72,473, పెద్దమల్లెలకు రూ.2,47,653, రొంపిచెర్లకు రూ.7,91,266 మంజూర య్యాయి. ఈ నిధుల్లో 60శాతం పారిశుద్ధ్యం, తాగునీటికి వియోగిస్తారు. 40శాతం విద్యుత్ దీపాల ఏర్పాటు, శానిటేషన్ సిబ్బంది జీతాలు, కరెంట్ చార్జీలకు వినియోగిస్తారని ఆవోఆర్‌డీ వివరించారు.

గాలికుంటువ్యాధి నివారణకు టీకాలు


ఏడూరులో లేగదూడలకు టీకాలు వేస్తున్న వైద్యులు

పుంగనూరు రూరల్, ఆగస్టు22: గాలికుంటువ్యాధి నివారణ కోసమే ప్రభుత్వం పశువులకు టీకాలు వేయిస్తున్నట్లు జిల్లా ప్రాంతీయ పశువ్యాధి నివారణ ప్రయోగశాల ఉపసంచాలకులు సుబ్బమ్మ, సుధారాణిలు తెలిపారు. మండలంలోని మాగాండ్లపల్లె, ఏడూరులో నాలుగు నెలల లేగదూడలకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఈ నెల 20 నుంచి సెప్టెంబరు 18తేదీ వరకు టీకాలను వేయిస్తున్నట్లు తెలిపారు. పాడిరైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సోమల: మండలంలోని వల్లిగట్ల పంచాయతీ ముడివారిపల్లెలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వ హించారు. 105 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. 19 పశువులకు గర్భకోశ పరీక్షలు చేపట్టారు. 25 లేగదూడలకు నట్టల నివారణ మందులు వేశారు. సెప్టెంబరు 18వ తేదీ వరకు టీకాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏడీ శ్రీనివాసులునాయుడు తెలిపారు. పశువైద్యాధికారి చందనప్రియ, సిబ్బంది నాగరాజ, సురేశ్, మహేశ్, అనూష, సహదేవ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

పుంగనూరు రూరల్, ఆగస్టు22: రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ సంఘటన పుంగనూరు మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని నెక్కుంది పంచాయతీ మొరుంపల్లెకు చెందిన ఆదినారాయణ కుమారుడు విష్ణు(17) ద్విచక్రవాహనంలో సొంత పనులపై పుంగనూరుకు వచ్చి తిరిగి ఇంటికి బయలుదేరాడు. పెద్దపంజాణి మండలం కొలతూరుకు చెందిన రామయ్య కుమారుడు వినయ్(18) ద్విచక్ర వాహనంలో పుంగనూరుకు వస్తున్నాడు. మర్రిమాకుల పల్లె వద్ద రెండు ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి ఢీకొన్నాయి. ఇద్దరూ గాయపడ్డారు. గాయపడిన వారిని 108లో పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

భక్తిశ్రద్ధలతో సంకటహర చతుర్థి పూజలు

రామకుప్పం, ఆగస్టు 22: రామకుప్పంలోని వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో గురువారం రాత్రి సంకటహర చతుర్థి పూజలు నిర్వహించారు. స్వామివారికి ప్రతేక అభిషేక పూజలు చేశారు. వివిధ రకాల పుష్పాలు, గరికతో విశేషంగా అలంకరించారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు.

మాన్యం భూముల వేలం వాయిదా

చౌడేపల్లె, ఆగస్టు22: స్థానిక గోసల కురప్పల్లెలో వెలసిన కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ మాన్యం భూముల సాగుకోసం నిర్వహించిన వేలం పాటలు వాయిదా పడినట్లు గ్రూప్ టెంపుల్స్ ఈవో కమలాకర్ పేర్కొన్నారు. గురువారం ఆయన ఆధ్వర్యంలో ఆలయంలో వేలం పాటలు చేపట్టారు. అయితే దురాక్రమణలు తొలగించి ఆ తరువాత వేలం వేయాలని గ్రామస్తులు డిమాండ్ చేయటంతో వేలం పాటలు వాయిదా వేశారు.

చిరంజీవి అభిమానుల అన్నదానం




పలమనేరు, పుంగనూరుల్లో కేక్ కట్ చేస్తున్న అభిమానులు

పలమనేరు, ఆగస్టు22 : పలమనేరులో గురువారం మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. స్థానిక కృష్ణదేవరాయలు విగ్రహం వద్ద కేక్ కట్‌చేశారు. పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో బాబు, కిరణ్, అరుణ్, బీఆర్సీ కుమార్, బాలాజి, వెంకటరమణ, కోటి, శివ తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరు రూరల్: పుంగనూరులో చిరంజీవి జన్మదిన వేడుకలను ఆయన అభిమాన సంఘ నాయకులు ఘనంగా నిర్వహించారు. భీమగానిపల్లె క్రాస్‌లో కేక్ కట్ చేసి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు జనార్థన్ రాయల్, భాస్కర్, పుంగనూరు సీఐ శ్రీనివాసులు, టీడీపీ మడల అధ్యక్షుడు మాధవరెడ్డి, జనసేన మండల అధ్యక్షుడు విరూపాక్షి, నరేశ్‌రాయల్, కల్యాణ్‌రామ్, అమరనాథ్, సతీష్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

సోమల: స్థానిక బస్టాండ్‌లో జనసేన మండల అధ్యక్షుడు నాగభూషణం రాయల్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచారు. అలాగే ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు, పాలు పంపిణీ చేశారు.

రామకుప్పం: కూటమి నేతల ఆధ్వర్యంలో స్థానిక ఆటోస్టాండు సర్కిల్లో చిరంజీవి అభిమానులు కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి రాజసింహా, జనసేన, బీజేపీ మండల అధ్యక్షులు హరీష్, వెంకటేశ్, సతీష్, యశ్వంత్, తంజిల్ తదితరులు పాల్గొన్నారు.

చౌడేపల్లె: మెగా అభిమాని మురళి ఆధ్వర్యంలో ప్రభుత్వాస్పత్రిలో పాలు, బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు. అలాగే స్థానిక బస్టాండ్‌లో చిరు అభిమానులు కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో చరణ్, మురళి, పగడాల హరిప్రసాద్, పురుషోత్తం, రాకేష్, నగేష్, గణశ్యాం, సాగర్ పాల్గొన్నారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు పదోన్నతి
- చుడా ఏవో బదిలీ


చిన్నయ్య

చిత్తూరు, ఆగస్టు 22: చిత్తూరు నగరపాలక సంస్థ శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నయ్యకు కమిషనర్‌గా పదోన్నతి లభించింది. గుంటూరు జిల్లా గురజాల మున్సిపాలిటీకి కమిషనర్‌గా నియమిస్తూ గురువారం స్పెషల్ చీఫ్ సెక్రటరీ అశోక్‌కుమార్ సింఘాల్ ఉత్తర్వులు జారీ చేశారు. 2006లో చిత్తూరు నగరపాలక సంస్థలో వర్కర్‌గా ఉద్యోగంలో చేరిన ఆయన హెల్త్ అసిస్టెంట్, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించారు. అలాగే చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా ఉన్న నరసింహారెడ్డిని బద్వేలు మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేసింది. ఇక్కడ ఎవరినీ నియమించలేదు.

జూనియర్లు సీనియర్లతో మమేకం కావాలి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ అన్నపూర్ణశారద

వెదురుకుప్పం, ఆగస్టు 22: జూనియర్ విద్యార్థులు సీనియర్లతో మమేకమైతే చాలా విషయాలు తెలుసుకోవచ్చునని వెదురుకుప్పం వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.అన్నపూర్ణశారద సూచించారు. గురువారం వెదురుకుప్పం కళాశాలలో కొత్తగా చేరిన విద్యార్థులకు స్వాగతం పలికి, కళాశాల నిబంధనలను పాటించాలని సూచించారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి


అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

చిత్తూరు, ఆగస్టు 22: నగరపాలక సంస్థ పరిధిలోని లేఅవుట్లలో వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని కమిషనర్ అరుణ అధికారులను ఆదేశించారు. గురువారం ఆమె అనుప్పల్లె లేఅవుట్‌లో జరుగుతున్న పనులను పరిశీలించారు. నిర్మాణాలకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని లబ్ధిదారులకు భరోసా కల్పించారు. లబ్ధిదారులకు రుణాలను మంజూరు చేయాలని మెప్మా అధికారులను ఆదేశించారు. హౌసింగ్ ఏఈ శ్రీధర్, వార్డు అమినిటీ అధికారులు పాల్గొన్నారు.

క్రైమ్ సీఐ బాధ్యతల స్వీకరణ



చిత్తూరు, ఆగస్టు 22: చిత్తూరు క్రైమ్ సీఐగా ఉమామహేశ్వరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు సీఐగా ఉన్న రామాంజినేయులును ప్రభుత్వం వీఆర్‌కు తీసుకోగా ఆయన స్థానంలో అన్నమయ్య జిల్లాలో సీఐగా ఉన్న ఉమామహేశ్వరరావును చిత్తూరుకు బదిలీ చేసింది. బాధ్యతల స్వీకరణ అనంతరం ఆయన ఎస్పీ మణికంఠను మర్యాదపూర్వకంగా కలిశారు.

అర్హులకు ఇంటి పట్టాలు మంజూరు చేయండి


గ్రామస్తులతో సప్తగిరి ప్రసాద్

తవణంపల్లె, ఆగస్టు 22: అర్హులైన వారికి ఇంటి పట్టాలు మంజూరు చేయాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ కోరారు. ఈ మేరకు ఆయన గురువారం అరగొండ పంచాయతీ పరిధిలోని చారాల గ్రామస్తులతో కలసి తహసీల్దార్ సుధాకర్‌కు వినతి పత్రం ఇచ్చారు. గత ప్రభుత్వంలో అర్హులైన వారికి కాకుండా వైసీపీ కార్యకర్తలు, ఇల్లు ఉన్న వారికి పట్టాలు మంజూరు చేశారని తెలిపారు. ఆక్రమాలపై విచారణ చేపట్టి, అర్హులైన వారికి మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మధు పాల్గొన్నారు.

ఎస్ఐ బాధ్యతల స్వీకరణ



తవణంపల్లె, ఆగస్టు 22: తవణంపల్లె ఎస్ఐగా చిరంజీవి గురువారం బాధ్యతలు చేపట్టారు. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణతో పాటు అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

గ్రామ సభలను విజయవంతం చేయండి

పాలసముద్రం, ఆగస్టు 22: మండలంలో శుక్రవారం నిర్వహించే గ్రామ సభలను విజయవంతం చేయాలని ఎంపీడీవో రామనాథరెడ్డి పేర్కొన్నారు. గ్రామస్తులు, ఉపాధి హామీ కూలీలు, రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొని పంచాయతీ పరిధిలో చేపట్టాల్సిన పనులను గుర్తించాలని కోరారు.

కర్ణాటక టెట్రా ప్యాకెట్ల స్వాధీనం


నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

గుడిపాల, ఆగస్టు 22: మండలంలోని పలు గ్రామాల్లో కర్ణాటక టెట్రా ప్యాకెట్లు విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మండలంలోని మరకాలకుప్పం గ్రామానికి చెందిన రాబర్ట్ కర్ణాటక రాష్ట్రం అనగొందపల్లి నుంచి 13 బాక్సుల (1152) టెట్రా ప్యాకెట్లు తీసుకొస్తుండగా చిత్తూరు-వేలూరు జాతీయ రహదారిలోని నరహరిపేట చెక్‌పోస్ట్ వద్ద అరెస్టు చేసినట్లు చెప్పారు. మరో వ్యక్తి ఉదయ్ పరారైనట్లు తెలిపారు. రాబర్ట్ మూడేళ్లుగా కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా, అతనిపై పలు కేసులు ఉన్నాయన్నారు.

పెట్రోల్ బంకు ప్రారంభం

గుడిపాల, ఆగస్టు 22: మండలంలోని దళవాయిపల్లి క్రాస్ వద్ద గురువారం ఇండియన్ పెట్రోల్ బంకును ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ప్రారంభించారు. టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, మాజీ జడ్పీటీసీ బాలాజీ నాయుడు, ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్, నాయకులు అనిల్ కుమార్, అరుణ్, నిత్యానందం, బాలసుబ్రహ్మణ్యం యాదవ్, సాంబశివ నాయుడు, పవన్, ఎన్ఆర్ఐ రాజేష్ పాల్గొన్నారు.

ముగిసిన ఆరాధనోత్సవాలు


అలంకరణలో స్వామివారు

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 22: జెండామాను వీధి భీమారావు సత్రంలోని రాఘవేంద్రస్వామి ఆలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఆరాధనోత్సవాలు గురువారం ఉత్తరారాధన పూజలతో ముగిశాయి. నిర్మాల్య విసర్జనం, పంచామృతా, కనకాభిషేకం, తులసి అర్చన, మహా మంగళహారతి, పల్లకి సేవా, రథోత్సవం వైభవంగా నిర్వహించారు. గిరింపేట సుగుణేంద్ర తీర్థ మూల సన్నిధానంలో రాఘవేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు ఉత్తరారాధన పూజలతో ముగిశాయి.

మహిళ మెడలో చైన్ చోరీ

చిత్తూరు, ఆగస్టు 22 : చిత్తూరు నగరం సాంబయ్యకండిగ వద్ద గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మహిళ మెడలో చైన్ లాక్కెళ్లారు. ఒకటో పట్టణ పోలీసుల వివరాల మేరకు.. సాంబయ్యకండిగకు చెందిన సునీత(35) నగరంలో పనులు చూసుకుని ద్విచక్ర వాహనంలో ఇంటికి వెళుతోంది. సాంబయ్యకండిగ జంక్షన్ వద్ద గుర్తు తెలియని వ్యక్తులు ఆమె మెడలో ఉన్న 30 గ్రాముల బంగారు చైన్ లాక్కుని వాహనంలో వేగంగా వెళ్లిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ శవ రాజకీయాలు బాధాకరం : టీడీపీ

చిత్తూరు సిటీ, ఆగస్టు 22: అచ్యుతాపురం ఫార్మా కంపెనీలో అగ్ని ప్రమాద ఘటనపై శవ రాజకీయాలు చేయడం వైసీపీ నేతలకు తగదని టీడీపీ చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్ పేర్కొన్నారు. ఘటనపై సీఎం చంద్రబాబు వెంటనే స్పందించి సహాయక చర్యలు, మెరుగైన వైద్య సేవలకు ఆదేశించారని తెలిపారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించి, ధైర్యం చెప్పారని పేర్కొన్నారు. మరణించిన, గాయాలపాలైన వారికి పరిహారం ప్రకటించారని తెలిపారు. అయితే వైసీపీ నేతలు ప్రభుత్వ ఒత్తిడి వల్లే ఫార్మా కంపెనీలో మరమ్మతులు చేయలేదని, పర్యవేక్షణ కొరవడిందని విమర్శలు చేయడం బాధాకరమని విమర్శించారు. ఇప్పటికైనా తీరు మార్చుకుని, వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని హితవుపలికారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

చక్రపాణినాయుడి మృతి తీరని లోటు


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నింద్ర, ఆగస్టు 22: టీడీపీ సీనియర్ నేత చక్రపాణి నాయుడు(68) మృతి పార్టీకి తీరని లోటని నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ అన్నారు. నింద్ర మండలం పాదిరి గ్రామానికి చెందిన చక్రపాణి నాయుడు గురువారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే ఆయన మృతదేహానికి పూలమాల వేసి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కొప్పేడు ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, నాయకులు వెంకటేశులు నాయుడు, రవికుమార్, రవినాయుడు ఆయన వెంట ఉన్నారు.

వైభవంగా కుంభాభిషేకం


హోమ పూజలు చేస్తున్న పీఠాధిపతులు

నగరి, ఆగస్టు 22 : నగరి మున్సిపాలిటీ పరిధిలోని కీలపట్టులో బుధవారం సరఫేశ్వరర్, ప్రత్యంగిర, వారాహి సన్నిధిల మహాకుంభాభిషేకం వైభవంగా నిర్వహించారు. చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో జరిగిన కుంభాభిషేకంలో ఆదిశక్తియేంద్ర స్వామి, జ్ఞానశక్తియేంద్రస్వామి పాల్గొని పూర్ణాహుతి, ఆరాధనమూర్తుల స్థాపన హోమం నిర్వహించారు. నిర్వాహకులు సుబ్రమణ్యం అన్నదానం చేశారు.

యువతకు నైతిక విలువలు ముఖ్యం


సమావేశంలో మాట్లాడుతున్న లీలాకుమారి

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 22: అన్ని రంగాల్లో రాణించాలంటే నైతిక విలువలు ఎంతో ముఖ్యమని విజ్ఞానసుధ ఛైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ లీలాకుమారి అన్నారు. యునెక్ట్ ఉన్నతి శిక్షణ సంస్థ బెంగళూరు సౌజన్యంతో నెల రోజుల పాటు చేపట్టనున్న శిక్షణా కార్యక్రమాలు గురువారం డిగ్రీ కళాశాలలో ఆమె ప్రారంభించారు. ప్రిన్సిపాల్ సోమశేఖర్, హబీబ్ పాల్గొన్నారు.

మొక్కలతోనే మానవాళికి మనుగడ


మొక్కలు నాటుతున్న అధికారులు, గ్రామస్తులు

బంగారుపాళ్యం, ఆగస్టు 22: మొక్కలతోనే మానవాళికి మనుగడ ఉంటుందని ఎంపీడీవో శివశంకర్ అన్నారు. మండలంలోని మొగిలివారిపల్లె గ్రామంలో గురువారం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్లాంట్ ఫర్ మదర్ కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ కూలీలతో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అన్ని పంచాయతీల్లోనూ రెండు వేల మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నామని ఏపీవో కిరణ్ తెలిపారు. టీడీపీ నాయకులు బాలసుబ్రహ్మణ్యం, బాబు పాల్గొన్నారు.

ఘనంగా మహాకుంభాభిషేకం


కలశాలను తీసుకొస్తున్న నిర్వాహకులు

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 22: నగరంలోని సీబీ రోడ్డులో వెలసిన గురు దక్షిణామూర్తి ఆలయ మహా కుంభాభిషేకం గురువారం అత్యంత ఘనంగా నిర్వహించారు. మూలవర్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తుల దైవనామస్మరణ నడుమ మహా కుంభాభిషేకం నిర్వహించారు. గురుకృప ట్రస్ట్ గురుగణేశ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాబు ప్రసాద్‌రెడ్డి, చిట్టిబాబు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం


అన్నదానం చేస్తున్న చిరంజీవి అభిమానులు

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 22: ప్రముఖ సినీ నటుడు చిరంజీవి జన్మదినం సందర్భంగా ఎంజీఆర్ వీధిలో గురువారం మెగా ఫ్యాన్స్ జిల్లా గౌరవాధ్యక్షుడు మండీ సుధ ఆధ్వర్యంలో 500 మందికి అన్నదానం చేశారు. చిరంజీవి అభిమానులు ప్రకాశ్, శ్రీనివాసుమూర్తి, ఉదయ్‌కుమార్, కట్టమంచి బుజ్జీ, బాల, అట్లూరి శీన, నాని, నరేష్, మురళి, సుదర్శన్, జయశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

విజయపురం : మండలంలోని పన్నూరు సబ్‌స్టేషన్‌లో జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి, చిరు ఫ్యాన్స్ జిల్లా ఉపాధ్యక్షుడు స్వామినాథన్ కేక్ కట్ చేసి, పంచిపెట్టారు. వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. అన్నదానం చేశారు.

నేడు పంచాయతీల్లో గ్రామసభలు

పెనుమూరు, ఆగస్టు 22: మండలంలోని 25 పంచాయతీల్లో శుక్రవారం జరిగే గ్రామ సభలను విజయవంతం చేయాలని ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి కోరారు. గ్రామ ప్రజలు, రైతులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో ఉపాధి హామీ అనుబంధ పనులకు ఆమోదం పొందాలని సూచించారు.

దర్జాగా ప్రభుత్వ భూమి కబ్జా

- చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు
- ఫిర్యాదు చేసినా చర్యల్లో జాప్యం



ఆక్రమిత భూమిలో మొక్కుబడిగా ఏర్పాటు చేసిన బోర్డు

వెదురుకుప్పం, ఆగస్టు 22: కార్వేటినగరం మండలం ముక్కరవానిపల్లె రెవెన్యూ లెక్క దాఖలా సర్వే నంబరు 202/5లో 3.78 ఎకరాల ప్రభుత్వ భూమిని గంగమాంబాపురం గ్రామానికి చెందిన వైసీపీ నేత కబ్జా చేశారు. అంతేగాక అందులో చెరకు సాగుచేస్తున్నాడు. ఈ ప్రాంతంలో గ్రామ దేవత తిరుపతి గంగమ్మకు ముక్కరవానిపల్లె గ్రామస్తులు పూజలు చేస్తుంటారు. శ్మశానికి అదే దారిలో వెళ్లాల్సి ఉంది. ఆక్రమణను అడ్డుకోకపోతే భవిష్యత్తులో సమస్యలు వస్తాయని గ్రామస్తులు వీఆర్వో నరసింహారెడ్డికి చెప్పగా ఆయన మండల అధికారులకు సమాచారం చేరవేసి మిన్నకుండిపోయారు. 2024 జూలై 19వ తేదీన కార్వేటినగరం తహసీల్దార్ కార్యాలయంలో అదే గ్రామానికి చెందిన డి.కందయ్య, గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఇంతవరకు చర్యలు తీసుకోలేదు. 2024 జూలై 20వ తేదీన సీ నంబరు: 95/2024 ప్రకారం ఓ సర్టిఫికెట్ జారీ చేశారు. ఇందులో ముక్కరవానిపల్లె సర్వే నంబరు మొత్తం విస్తీర్ణం 3.78 ఎకరాలు(గుట్టపోరంబోకు)గా చూపించారు. అలాగే సర్వే నంబరు 202/6లో 1.53 ఎకరాలు రెవెన్యూ రికార్డుల ప్రకారం ప్రభుత్వ భూమి అని చూపించారు. కానీ సర్వే నంబరు-202/5లోని 0.89 సెంట్లలో మాత్రమే ఇటీవల బోర్డు ఏర్పాటు చేయడంపై స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ ఉన్నతాధికారులు దృష్టి సారించి, ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతున్నారు.

నైపుణ్యం పెంపుతో ఉన్నతోద్యోగాలు


జాబ్‌మేళాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 22: గ్లోబల్ స్థాయి ఉద్యోగాలు పొందాలంటే విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. గురువారం పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాను ఎమ్మెల్యే ప్రారంభించి, విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కాలానుగుణంగా సాంకేతికతను పెంచుకోవాలన్నారు. జాబ్‌మేళా ద్వారా ఉద్యోగావకాశాలు కల్పిస్తున్న కంపెనీ ప్రతినిధులను అభినందించారు. ప్రిన్సిపాల్ జీవనజ్యోతి, మేయర్ అముద, అధ్యాపకులు, కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఫిల్లింగ్ స్టేషన్ ప్రారంభం


బండికి పెట్రోల్ పట్టుకుంటున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు, ఆగస్టు 22: నగరంలోని ఏఆర్ టాప్‌లైన్ పోలీసు క్వార్టర్స్‌లో ఐవోసీఎల్ సహకారంతో నూతనంగా నిర్మించిన శ్రీవరసిద్ధి వినాయక పోలీస్ వెల్ఫేర్ ఫిల్లింగ్ స్టేషన్‌ను గురువారం ఎస్పీ మణికంఠ ప్రారంభించారు. ముందుగా తన వాహనానికి పెట్రోల్ పట్టించుకున్నారు. పోలీసులతో పాటు ప్రజలకు నాణ్యమైన పెట్రోల్, డీజిల్ అందించడానికి ఈ స్టేషన్‌ను నిర్మించామన్నారు. ఏఎస్పీలు ఆరీఫుల్లా, నాగేశ్వరరావు, డీఎస్పీలు మహబూబ్‌బాషా, ఇలియాస్‌బాషా, ఎస్‌బీ సీఐ మనోహర్, సీఐలు జయరామయ్య, నెట్టికంటయ్య, శ్రీనివాసరావు, నిత్యబాబు, ఆర్ఐలు భాస్కర్, సుధాకర్, ఏవో మోహన్‌రావు, పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లలో సామాన్యులను వేధించవద్దు


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, ఆగస్టు 22: భూములు, ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ విషయంలో సామాన్యులను వేధించవద్దని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అధికారులకు సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా రిజిస్ట్రేషన్లు చేయాలన్నారు. అవసరమైన ధ్రువపత్రాలను ముందుగానే తెప్పించుకుని రిజిస్ట్రేషన్లు చేయాలని సూచించారు. పరిమితికి మించి వసూలు చేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని డాక్యుమెంటు రైటర్లను హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజిస్ట్రేషన్ ఫీజు తీసుకోవాలన్నారు. రిజిస్ట్రార్ సుబ్రమణ్యం, తహసీల్దార్ రవికుమార్, సర్వేయర్ సురేష్, టీడీపీ నాయకులు రమేష్‌బాబు, టీఎన్టీయూసీ బాలాజీ, బాలాజీ, శ్రీనివాసన్, గుణశేఖర్, జ్యోతినాయుడు పాల్గొన్నారు.

సద్గుణాలతో దైవత్వం సిద్ధిస్తుంది


గీతాజ్ఞాన బోధన చేస్తున్న శ్రేయానంద సరస్వతి

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 22: తనను తాను సంస్కరించుకున్న ప్రతి ఒక్కరూ దైవ స్వరూపులేనని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రబోధకురాలు స్వామిని శ్రేయానంద సరస్వతి చిన్మానంద అన్నారు. వేలూరు రోడ్డులోని సద్గురు సేవా ఆశ్రమంలో ఐదు రోజులుగా ఆమె గీతాజ్ఞాన యోగంపై ప్రవచిస్తున్నారు. మనలోని భయాలు మనలో కలిగే అనుమానాలేనని, అనుమానం వదిలి వాస్తవ దృక్పథంతో జీవించే వారే సుఖశాంతులు అనుభవిస్తారని చెప్పారు. నిర్వాహకులు పరబ్రహ్మస్వామి, రఘుపతి, కేశవులు, బాబునాయుడు పాల్గొన్నారు. గిరింపేట సత్యసాయి సంస్థాన్‌ను శ్రేయానంద సరస్వతి సందర్శించి, ఆధ్యాత్మిక, సామాజిక, సంక్షేమ కార్యక్రమాలను పరిశీలించి అభినందించారు. బాలవికాస్ విద్యార్థులకు చదువు, విజ్ఞానం, భవిష్యత్తు అనే అంశాలను వివరించారు. సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మధుసూదనం, నగర కన్వీనర్ శేషనారాయణ, పాండురంగం, గజేంద్రరెడ్డి, శ్రీకంఠయ్య పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై తక్షణం స్పందించాలి

- 'డయల్ యువర్ ఎమ్మెల్యే'కు 37 ఫిర్యాదులు

చిత్తూరు, ఆగస్టు 22: డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణం స్పందించాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం ఆయన డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమాన్ని మేయర్ అముదతో కలిసి నిర్వహించారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. ఈనెల 8న జరిగిన కార్యక్రమంలో అందిన 34 ఫిర్యాదుల్లో 19 పరిష్కరించగా 15 పురోగతిలో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, కమిషనర్ అరుణ, సహాయ కమిషనర్ రామకృష్ణుడు, రూరల్, గుడిపాల మండలాల అధికారులు పాల్గొన్నారు.

సమయానికి రాని ఆర్టీసీ బస్సు

- అవస్థల్లో విద్యార్థులు


బస్సు కోసం వేచివున్న విద్యార్థులు

గుడిపాల, ఆగస్టు 22: మండలంలోని చిత్తపార బస్సు సమయానికి రాకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. నరహరిపేట జడ్పీ హైస్కూల్‌లో చిత్తపార, బండపల్లికి చెందిన విద్యార్థులు చదువుతున్నారు. సాయంత్రం 4 గంటలకు రావాల్సిన బస్సు రెండు గంటలు ఆలస్యంగా వస్తుండడంతో చీకటిపడే వరకు విద్యార్థులు రోడ్డుపైనే వేచి ఉండాల్సి వస్తోంది. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలకు పంపించడానికి భయపడుతున్నారు. పాఠశాల వద్దకు సాయంత్రం 4నుంచి 4.30 గంటల్లోపు బస్సు వచ్చేలా చర్యలు తీసుకోవాలని మండల మీట్‌లో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఆర్టీసీ అధికారులను ఆదేశించినా పట్టించుకోలేదు.

కూలీలకు పనులు కల్పించండి


మొక్కలు నాటుతున్న పీడీ రాజశేఖర్

పెనుమూరు, ఆగస్టు 22: మండలంలోని అన్ని గ్రామాల్లో కూలీలకు ఉపాధి పనులు కల్పించాలని డ్వామా పీడీ రాజశేఖర్ ఆదేశించారు. పులికల్లు పంచాయతీలో కాలువ పూడికతీత పనులను ఆయన గురువారం తనిఖీ చేశారు. కూలీలతో చర్చించారు. గొడుగుమానుపల్లి, అట్లవారిపల్లిలో మొక్కలు నాటారు. ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో మొక్కలు నాటించాలన్నారు. పండ్ల తోటల పెంపకం, పూలసాగులో రైతులకు పనులు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ సుబ్రమణ్యం, ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి, ఏపీవో గుణశేఖర్, ఈసీ సతీష్, టీఏలు వినోద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్ల వితరణ



పెనుమూరు, ఆగస్టు 22: మండలంలోని మణియానంపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పార్థసారథి నాయుడు గురువారం భోజన ప్లేట్లు వితరణ చేశారు. బాగా చదువుకుని, ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

కలెక్టరేట్‌లో పచ్చదనం


మొక్కలు నాటుతున్న అధికారులు

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 22: కలెక్టరేట్‌లో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా కలెక్టర్ సుమిత్‌కుమార్ చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా జ్యోతిరావు పూలే భవన్ సముదాయం సమీపంలో ఉన్న ఖాళీ స్థలంలో గురువారం డ్వామా అధికారులు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. పీడీ రాజశేఖర్, అడిషినల్ పీడీ గంగాభవానీ, ఏపీవోలు, ఏపీడీలు పాల్గొన్నారు.

ద్వితీయ పుష్కర మహాకుంభాభిషేకం

వెదురుకుప్పం, ఆగస్టు 22: కార్వేటినగరం గ్రామ దేవత బంగారమ్మ ఆలయంలో గురువారం ద్వితీయ పుష్కర మహాకుంభాభిషేక మహోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహాగణపతి పూజ, పుణ్యాహవచనం, అగ్నిప్రతిష్ఠ, పంచగవ్య ప్రాశన వంటి పూజలు చేశారు. పరిసర గ్రామాల భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. మహాకుంభాభిషేక పూజలు మూడు రోజులు జరుగుతాయని ఆలయ కమిటీ అధ్యక్షుడు ప్రసాద్ తెలిపారు.

విద్యా సామగ్రి పంపిణీ



విజయపురం, ఆగస్టు 22: మండలంలోని సామిరెడ్డికండ్రిగ ప్రాథమిక పాఠశాలలో బుధవారం రిటైర్డు హెచ్ఎంలు చంద్రయ్య, దొరస్వామిలు విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు పెన్నులు, పెన్సిల్, నోటు పుస్తకాలు అందించారు.

పాఠశాల అభివృద్ధికి సహకరించాలి

విజయపురం, ఆగస్టు 22: పాఠశాల అభివృద్ధికి ఎస్ఎంసీ సభ్యులు సహకరించాలని హెచ్ఎం జ్ఞానప్రసాద్ కోరారు. శ్రీహరిపురం ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం ఎస్ఎంసీ సమావేశం ఏర్పాటు చేసి ఛైర్మన్ సురేష్, వైస్ ఛైర్మన్ ఐలవతిలను సన్మానించారు.

ప్రమాదం జరిగితే కానీ పట్టించుకోరా?


రేణుకానగర్ వద్ద రోడ్డుపై పడిన గుంత

పెనుమూరు, ఆగస్టు 22: మండలంలోని అధ్వాన రోడ్లతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న ఆందోళన వాహనదారుల్లో నెలకొంది. పెనుమూరు నుంచి చిత్తూరు వెళ్లే మార్గంలో చాలాచోట్ల రోడ్డు పాడై గుంతలు ఏర్పడ్డాయి. రేణుకానగర్ వద్ద నడి రోడ్డుపై కల్వర్టుకు గుంత పడి పది రోజులవుతున్నా ఇంత వరకు ఎవరూ పట్టించుకోలేదు. అక్కడ ఇప్పటికే నాలుగు ప్రమాదాలు జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. ఇదే మార్గంలో గంగుపల్లి చెరువు వద్ద రోడ్డు పనుల్లో భాగంగా ఎన్నికలకు ముందు కొంత దూరం రోడ్డును తవ్వేశారు. నిర్మాణం చేపట్టకపోవడంతో ఇరుకు రోడ్డులో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇటీవల కారు బోల్తా కొట్టడంతో ఇద్దరు తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలయ్యారు. ఉగ్రాణంపల్లి లింకు రోడ్డు వద్ద గుంతలు ఉండటంతో ద్విచక్ర వాహనాలు జారడంతో ప్రయాణికులు పడిలేచి వెళుతున్నారు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాహనదారులు వాపోతున్నారు. రోడ్లు భవనాల శాఖ అధికారులు ఇప్పటికైనా దృష్టి సారించాలని కోరుతున్నారు.